

అనుమానాస్పద మృతి

పౌర హక్కుల నేత అనుమానాస్పదంగా మృతి చెందారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. - 8లో



నేటి నుంచి జేఈఈ మెయిన్స్

జేఈఈ మెయిన్స్‌కు సెంటర్ సిద్ధమైంది. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీలో పరీక్ష జరగనుంది. - 8లో



పలాస ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద చెప్పులు కుడుతున్న గురివారి దాస్

న్యూస్‌రీల్

బకాయిలు విడుదల చేయాలని వినతి



జేసీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కి వినతి పత్రం అందజేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్ తక్షణం ఏర్పాటు చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు మొత్తం 32 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57 ప్రాప్తికి 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను పాత పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలని, ఇటీవల ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపునకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శులు పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్ పి.బాబూరావు, జిల్లా నాయకులు ఎల్.కోదండరామయ్య, కె.సురేష్ కుమార్, టి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీలకు నలుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక ఆలిండియా స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి రికార్డు స్థాయిలో నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు మహారాష్ట్రలోని జలగం వేదికగా జరగనున్నాయి. జిల్లా నుంచి ఎంపికైనవారిలో మెట్ట అఖిల్ (కేశవరావుపేట), ఎతురాజుల లక్ష్మీప్రసాద్ (కేశవరావుపేట), ఎతురాజుల పవన్ (కేశవరావుపేట), తియ్యల లావణ్య (ఇప్పిలి) ఉన్నారు. వీరు నలుగురు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని మంగళవారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తన ఛాంబర్‌లో అభినందించారు. జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్లను విజయపథంలో నిలపాలని ఆకాంక్షించారు. వీరిని తీర్చిదిద్దుతున్న పీడీలు, శిక్షకులు, సాఫ్ట్‌బాల్ సంఘ బాధ్యులను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, మొజ్జాడ వెంకటరమణ, బీవీ రమణ, ఎం.సాంబమూర్తి, మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల ఏకరువు.. ▶ పరిష్కారం కరువు

అక్టోబర్‌లో గ్రామసభలు పెట్టి సమస్యలు చెప్పాలని కోరారు.. డిసెంబర్‌లో రెవెన్యూ సదస్సులు పెట్టి మళ్లీ సమస్యలు ఉంటే విన్నవించాలన్నారు.. ఇవి కాక మీకోసం అంటూ ప్రతి వారం అధికారుల వద్ద ఫిర్యాదులు చేసుకోవచ్చని చెప్పారు. జనం సమస్యలు చెబుతూనే ఉన్నారు. కానీ వాటికి పరిష్కారమే ప్రభుత్వం సూచించలేకపోతోంది. పేర్లు మార్చి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఫిర్యాదులు స్వీకరిస్తున్న కూటమి ప్రభుత్వం.. ఆనక ఆ అర్జీలకు న్యాయం చేయలేకపోతోంది.

- ఆర్భాటానికే పరిమితమైన కూటమి ప్రభుత్వం
- గ్రామసభలు, రెవెన్యూ సదస్సులకు వచ్చే అర్జీలకు కలగని మోక్షం
- అక్టోబర్‌లో పెద్ద ఎత్తున గ్రామసభల నిర్వహణ
- డిసెంబర్‌లో రెవెన్యూ సదస్సులు
- అర్జీల స్వీకరణలో గందరగోళం
- పరిష్కారంలో తీవ్ర జాప్యం



అక్టోబర్‌లో జరిగిన గ్రామ సభలు **735**

వచ్చిన అర్జీలు : **30,514**

పరిష్కరించినవి : **1808**

పెండింగ్‌లో ఉన్నవి **28,706**

రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు **31,559**

పరిష్కరించినవి : **1070**

పెండింగ్‌లో ఉన్నవి **30,489**

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమని పెద్ద ఎత్తున గ్రామసభలు నిర్వహించింది. ఎమ్మెల్యేలు సైతం హాజరై హడావుడి చేశారు. ఫక్తు రాజకీయ సభల్లా కార్యక్రమాలు నడిపారు. 735 గ్రామాల్లో సభల ద్వారా 30,514 అర్జీలను యంత్రాంగం సేకరించింది. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 16,711ఉండగా, సర్వే శాఖకు సంబంధించి 13,958 అర్జీలు ఉన్నాయి. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని అర్జీలివ్వగా వాటికి ఆన్‌లైన్ ఎంట్రీలోనే ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. 13,944 అర్జీలు ఎంట్రీ తర్వాత...ఆ ప్రక్రియను నిలిపేసి రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో గ్రామ సభల్లో వచ్చిన అర్జీలు ఎక్కడికక్కడ వదిలేసి అధికారులు రెవెన్యూ సదస్సులపై పడ్డారు. ఫలితంగా ఆన్‌లైన్ ఎంట్రీ జరగని మిగతా వాటి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కాకపోతే, మాన్యువల్‌గా గ్రామసభల్లో సేకరించిన 30,514 అర్జీల్లో 1808 అర్జీలు పరిష్కారమైనట్టు మాన్యువల్ నివేదికల్లో చూపించారు.

రె'వెన్యూ' మారిందంతే..

అక్టోబర్ గ్రామసభల గురించి మర్చిపోయిన తర్వాత ప్రభుత్వం డిసెంబర్ నెలలో మరో కార్యక్రమానికి తెరతీసింది. ఈసారి గ్రామ సభలు బదులు రెవెన్యూ సదస్సుల పేరుతో కార్యక్రమం చేపట్టింది. ఊరూరా సదస్సులు పెట్టి, కూటమి నాయకులతో హడావుడి చేసింది. గ్రామసభల్లో ఇచ్చిన అర్జీలకు అతీగతి లేకపోయినా...ఆ సభల్లో అర్జీలు ఇవ్వని వారు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చారు. ఇక, గ్రామసభలు జరగని చోట జరిగిన రెవెన్యూ సదస్సుల్లో కూడా పెద్ద ఎత్తున అర్జీలు వచ్చాయి. డిసెంబర్6వ తేదీ నుంచి జనవరి 8 వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 31,559 అర్జీలు వచ్చాయి. వాటిలో 1070 మాత్రమే పరిష్కారమైనట్టు నివేదికల్లో చూపించారు. మిగతావన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. సమస్య తీవ్రత ఆధారంగా గడువు నిర్దేశించి పరిష్కారం చూపుతామని ప్రభుత్వం ప్రకటించింది. నిర్ణీత గడువుల్లో సమస్యలు పరిష్కారమైపోతాయని ప్రజలకు ఆశలు కల్పించారు. కానీ వేలల్లో అర్జీలు వస్తే.. వందల్లో పరిష్కారం చూపినట్టు నివేదికలు చెబుతున్నాయి.

యంత్రాంగం తికమక



రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమని తొలుత నిర్వహించిన గ్రామసభల్లో స్వీకరించిన 30,514 అర్జీల్లో కేవలం 13,944 అర్జీల డేటా మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ ప్రక్రియ చేస్తుండగానే వాటిని ఎక్కడికక్కడ వదిలేసి రెవెన్యూ సదస్సులపై దృష్టిసారించమని ప్రభుత్వం చెప్పింది. దీంతో రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలపై యంత్రాంగం దృష్టి సారించింది. ప్రభుత్వం పెట్టిన ఆప్షన్లు, కండిషన్లు, రకరకాల సూచనలతో సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికే సమయం తీసుకుంది. దీంతో వచ్చిన అర్జీల పరిష్కారానికి సమయమే లేకుండా పోయింది. దీనికి తోడు గ్రామసభల్లో వచ్చిన అర్జీల్లో సగానికి పైగా అప్‌లోడ్ చేయకుండా వదిలేసిన అర్జీలను రెవెన్యూ సదస్సుల సమయంలో అప్‌లోడ్ చేయాలని సర్కారు ఆదేశించింది. ఇది యంత్రాంగానికి కొత్త తలపోటు తెచ్చి పెట్టింది.



ఆమదాలవలస మున్సిపాలిటీ కృష్ణాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు(ఫైల్)



టెక్కలి మండలం మేఘవరం పంచాయతీలో రెవెన్యూ సదస్సులో అర్జీల స్వీకరణ(ఫైల్)

ఆమె బతుకు.. కష్టాల అతుకు

- చెప్పులు కుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్న మహిళ
- పింఛన్‌కు కూడా నోచుకోని వైనం

కాశీబుగ్గ: కడదాకా తోడుంటానని ప్రమాణం చేసిన భర్త మధ్యలోనే చనిపోయారు. కుటుంబ బాధ్యతలన్నీ వచ్చి ఒక్కసారిగా నెత్తిన పడ్డాయి. ఇంటిలో పేదరికం వెక్కిరిస్తోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆ మహిళ ధైర్యంగా నిలబడింది. కష్టపడి పనిచేస్తూ బతుకును 'చెప్పు'చేతల్లోకి తెచ్చుకుంది. చెప్పులు కుట్టే వృత్తిని ఎంచుకుని కుటుంబానికి ఓ దారి చూపించింది. కన్నీళ్ల నుంచి బయటపడినా కష్టాలు మాత్రం ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. బతుకు వెతుక్కుంటూ ఒడిశా దాటి ఆంధ్రాకు వచ్చిన ఆ మహిళ కాసింత చేయూతను కోరుతున్నారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 20వ వార్డు లేబరు కాలనీలో ఓ చిన్నపాటి అద్దె ఇంట్లో గురివారి దాస్ అనే మహిళ నివాసం ఉంటున్నారు. ఈమె పలాస ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న కల్వర్టు పక్కన చెప్పులు కుట్టుకుంటూ బతుకుతున్నారు. సాధారణంగా ఈ వృత్తిలో అంతా మగవారే ఉంటారు. కానీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆమె ఈ వృత్తిని ఎంచుకున్నారు. వాస్తవానికి ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురానికి సమీపంలో మారుమూల గ్రామంలో ఉండేవారు. భర్త లక్ష్మణదాస్ చెప్పులు కుట్టుకునే వృత్తిలో ఉండేవారు. అనారోగ్యంతో ఆయన మరణించారు. అప్పటి నుంచి ఇద్దరు చిన్నపిల్లలను పెంచుకుంటూ వస్తున్నారు. తన చిన్నతనంలో తన తండ్రి సైతం చెప్పులు కుట్టుకు ని కుటుంబాన్ని పోషించారని, భర్త కూడా అదే పని చేశారని అందుకే అదే వృత్తిని ఎంచుకున్నాన ని చెబుతున్నారు. ఆమె ఇద్దరు కుమారులలో సునీల్ దాస్ ఒడిశాలో స్థిరపడ్డారు. చిన్న కుమారుడు బబుల్‌దాస్ పలాసలో జీడి పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

పింఛన్ ఇప్పించండి సార్

ఒడిశా నుంచి మేం వచ్చేశాం. ఇక్కడ ఎలాంటి ఆధారం లేదు. ఇక్కడకు వచ్చి ఐదేళ్లు దాటిపోయింది. గత ప్రభుత్వంలో ఫించన్ వచ్చే సమయానికి ఒడిశా రేషన్ కార్డులో పేరు ఉండటంతో రాలేదు. ఇప్పుడు అన్నీ అక్కడి డిలేట్ చేసేశాం. ఇక్కడే స్థిరపడిపోయాం. ప్రభుత్వం రేషన్ కార్డు ఇప్పించి పింఛన్ అందిస్తే సహాయంగా ఉంటుంది. – గురివారి దాస్, లేబరుకాలని, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

27న విద్యాసంస్థల్లో సామూహిక సూర్యనమస్కారాలు



శ్రీకాకుళం న్యూకాలనీ: రథసప్తమిని పురస్కరించుకుని ఈనెల 27న విద్యాసంస్థల్లో సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నిర్ణయించారు. రథసప్తమి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఉత్సవాలను రాష్ట్ర పండగగా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇతర అన్ని విద్యాసంస్థల్లో ఈనెల 27వ తేదీన సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించాలని, వాటి ఫొటోలను అప్లోడ్ చేయించాలని కలెక్టర్ ఆదేశించినట్టు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీవీఈఓ ఎస్.తవిటి నాయుడు, ఆర్ఐఓ పి.దుర్గారావు పేర్కొన్నారు.

బొడ్డపాడు అల్లుడు చలపతి

- మావో అగ్రనేత చలపతి మృతితో ఉద్దానంలో విషాదం



పలాస: మావోయిస్టు ముఖ్యనేత చలపతి మృతి చెందడంతో ఉద్దానం ఉలిక్కిపడింది. ఆయనతో ఉద్దానానికి అవినాభావ సంబంధం ఉంది. అంతేకాదు ఆయన ఉద్యమాల పురిటి గెడ్డ బొడ్డపాడు గ్రామానికి అల్లుడు కూడా. ఆ గ్రామానికి చెందిన రుక్మిణి అనే అమ్మాయిని పెళ్లి చేసుకొని ఆమెను కూడా ఆనాటి పీపుల్స్‌వార్ పార్టీలోకి తీసుకొని అజ్ఞాత జీవితాన్ని గడిపారు. ఉద్దానం ప్రాంతంలో ఎన్నో ప్రజా పోరాటాలను చేపట్టారు. పార్టీపై ప్రభుత్వం నిషేధం విధించడంతో రహస్య జీవితంలోకి వెళ్లిపోయారు. ఆయనతో పాటు ఆమె కూడా పార్టీ రహస్య కార్యక్రమాల్లోకి వెళ్లిపోయారు. 1988లో చిత్తూరు జిల్లా నుంచి శ్రీకాకుళం వచ్చిన చలపతి సుధాకర్‌గా పేరు మార్చుకుని ఉద్దానం ప్రాంతంలో ఆర్గనైజర్‌గా పనిచేశారు. ఆయన పూర్తి పేరు ప్రతాప రెడ్డి. 1988 నుంచి 94 వరకు ఉద్దానం ప్రాంతంలో పనిచేసి ఆ పార్టీని నడిపించాడు. ఆ సమయంలోనే బొడ్డపాడు గ్రామానికి చెందిన రుక్మిణి అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత ఆమె కూడా పోలీసు ఎదురు కాల్పుల్లో మృతి చెందారు.

ఈ ఫొటో చూడండి. గార ఇసుక డీసిల్టేషన్ స్టాక్ యార్డ్ ముసుగులో వర్క్ దక్కించుకున్న అమరావతికి చెందిన భవానీ ట్రావెల్స్ పేరుతో తెలుగు తమ్ముళ్లు చేస్తున్న అక్రమ దందా ఇది. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ టిబ్యునల్ ఆదేశాల మేరకు నదిలో యంత్రాలతో ఎలాంటి తవ్వకాలు జరపకూడదు. కానీ, ఇక్కడవేవీ అమలు కావడం లేదు.



ఈ ఫొటో చూడండి. ఇసుక ర్యాంపు కోసం ఏకంగా నదిలో బాట వేసిన దృశ్యమిది. సుప్రీం కోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం నదులో బాటలు వేసి ధ్వంసం చేయకూడదు. ఇక్కడ అందుకు భిన్నంగా జరుగుతోంది.



అధికార ప్రకోపం ▶ ప్రకృతి విధ్వంసం



తవ్వకాల సమీపంలో రోజువారీ 33 గ్రామాలకు తాగునీరు అందించే ఇన్‌ఫిల్టరేషన్ బావి, పంప్ హౌస్ ఇది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో మత్స్యకార ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించారు. ఈ ఫిల్టరేషన్ బావికి 500 మీటర్లు వరకు ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదన్న నిబంధనలున్నా పట్టించుకోవడం లేదు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అధికార ర్యాంపులో అక్రమాల జాతర జరుగుతోంది. అమరావతికి చెందిన ప్రభుత్వ పెద్దల చేతిలో ఇక్కడ ర్యాంపు ఉంది. స్థానిక నేతల భాగస్వామ్యంతో ఏకంగా సహజ వనరుల విధ్వంసమే జరుగుతోంది. వంశధార నది బక్కచిక్కిపోతున్నా, అక్కడున్న ఇన్‌ఫిల్టరేషన్ వెల్, ఓవర్ హెడ్ ట్యాంకుకు ముప్పు వాటిల్లుతున్నా, శ్మశాన స్థలాన్ని ఛిద్రం చేస్తున్నా అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. చుట్టు పక్కల మంచినీటి పంప్ హౌస్, ఓవర్ హెడ్ ట్యాంక్, శ్మశాన వాటిక, రక్షణ గోడ తదితరాలు ఉన్నా ఇక్కడెలా అధికారులు అనుమతిచ్చారో అర్థం కావడం లేదు. మండల కేంద్రం నుంచి కళింగపట్నం వరకు భైరి ఓపెన్ హెడ్ చానెల్ పిల్ల కాలువ ద్వారా పంట సాగవుతుంది. శివారు కావడంతో సాగునీరు లభ్యత కష్టం. రైతులు మోటారు పంపుసెట్లు మీద ఆధారపడుతూ పంటలు పండిస్తున్నారు. ఇసుక తవ్వకాల సమీపంలోనే 100కి పైగా వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. వీటిన్నింటికి భవిష్యత్‌లో నీరు అందే పరిస్థితి ఉండదు. అంతేకాకుండా ఇక్కడికి 7 కిలోమీటర్ల దూరంలో సముద్రం ఉంది. తవ్వకాలు కారణంగా బ్యాక్ వాటర్ నదిలోకి వచ్చి భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉంది.

- కూటమి ప్రభుత్వం అడ్డగోలుతనం
- వంశధారను గుల్ల చేస్తున్న నిర్వాహకులు
- కాంట్రాక్టర్, స్థానిక నేతలు కుమ్మక్కై దోచుకుంటున్న పరిస్థితి
- సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు విరుద్ధంగా తవ్వకాలు
- శ్మశాన వాటికను వదలని అక్రమార్కులు



ఇసుక తవ్వకాలతో భవిష్యత్‌లో కోతకు గురయ్యే అవకాశం ఉన్న రక్షణ గోడ ఇది. 2012–13 సంవత్సరంలో సుమారు రూ.4 కోట్ల నిర్మాణంతో రెండు పార్టులుగా ఈ రక్షణ గోడను రోడ్లు భవనాల శాఖ నిర్మించింది. వంశధార వరదల సమయంలో సీఎస్పీ రోడ్డు కోతకు గురవ్వడంతో పాటు పొలాలు, ఆరంగిపేట, వమరవల్లి వంటి ప్రాంతాలకు వెళ్లకుండా గోడ నిర్మించారు. ఇప్పుడీ తవ్వకాలతో రక్షణ గోడకు ముప్పు వాటిల్లనుంది.

సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా

సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను అస్సలు పట్టించుకోవడం లేదు. వాటి మార్గదర్శకాలను పాటించడం లేదు. అమరావతికి చెందిన కాంట్రాక్ట్ ఏజెన్సీ వంశధార నదిని గుల్ల చేసేస్తోంది. నదిలోకి యంత్రాలకు ప్రవేశం లేదు. వాటితో తవ్వకాలు జరపడకూదు. కానీ ఇష్టారీతిన తవ్వకాలు చేస్తున్నారు. నదిలోకి దింపి నేరుగా వాహనాలకు లోడింగ్ చేసుకుంటూ వెళ్తున్నారు. వాస్తవంగా జిల్లా కమిటీ నిర్దేశించిన వ్యక్తుల సమక్షంలో తవ్వకాలు జరపాలి. తవ్విన పరిమాణం ఎంతో ఎప్పటికప్పుడు కొలత లేసి లెక్కించాలి. కానీ ఇక్కడ అటువంటివేవి జరగడం లేదు. జిల్లా కమిటీ సూచించిన వ్యక్తులు ఏం చేస్తున్నారో ఎక్కడుంటున్నారో తెలియడం లేదు. కాంట్రాక్ట్ దక్కించుకున్న భవానీ ట్రావెల్స్ ఏజెన్సీ పేరుతో కొందరు తెలుగు తమ్ముళ్లే అంతా తామై వ్యవహరిస్తున్నారు. నచ్చినట్టుగా వసూలు చేసి, తోచిన రశీదులిచ్చి ఇసుక దందాను యథేచ్ఛగా కానిచ్చేస్తున్నారు. ఇక్కడ రోజుకి అడ్డగోలు బిజినెస్ రూ.లక్షల్లోనే ఉంది. ఎంత ఇసుక ఇక్కడి నుంచి తరలిపోతుందో లెక్కాపత్రం లేదు. ఇక్కడ అడ్డగోలుగా దోపిడీ జరుగుతోంది. ఇంత జరుగుతున్నా అధికార వర్గాలు ఏం మాట్లాడటం లేదు.

నిబంధనలకు తిలోదకాలు..

ర్యాంపులో పగటి పూట మాత్రమే తవ్వకాలు జరపాలి. కానీ, రాత్రి వేళల్లో తవ్వకాలు జరిపి, తరలిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 21వ తేదీ రాత్రి ఇసుక తరలిస్తున్న వాహనాలు స్థానికులు అడ్డుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న బిల్డింగులు ఊగుతున్నాయని, చిన్నారులకు నిద్ర కరువైవుతుందని వాహనాలు నిలిపేసి అడ్డుకున్నారు. పోలీసులు వచ్చి సర్దిచెపి కొద్ది రోజుల పాటు నిలిపేసారు. మళ్లీ ఏదోవిధంగా తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. నదిలో ఇసుక తవ్వకాలపై సీసీ కెమెరాలు పెట్టాలని గ్రీన్‌ట్రిబ్యునల్ స్పష్టంగా ఆదేశాలిచ్చింది. జిల్లాలోని మండల కేంద్రం, పేరున్న కళింగపట్నం రోడ్డుపక్కనే జరుగుతున్న పట్టించుకోని పరిస్థితి ఉంది.

తవ్వకాలకు 100 మీటర్ల దూరంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ఇది. రోజుకి లక్ష లీటర్లు నీరు అందించే ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఇది. దీనికి కూడా ముప్పు వాటిల్లే విధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.





గారలో ఉన్న శ్మశాన వాటిక ఇది. ఈ శ్మశాన వాటిక మీదుగా ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీని వల్ల శ్మశానం వాస్తవ రూపం కోల్పోయింది. ఇక్కడే నదిలో నుంచి లారీలు పైకి ఎక్కుతున్నాయి.

ఓ ప్రైవేటు కంపెనీ కోసం వంశధార నదిలో నిర్మించి ఇన్ ఫిల్టరేషన్ బావి ఇది. కొన్ని అడుగుల దూరంలోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.



24న డి.ఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డి.ఫార్మసీ ఖాళీ సీట్లకు ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ విక్టర్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ గ్రూపు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రభుత్వ రాయితీలు వర్తించబోవని స్పష్టం చేశారు. ఏడాది ఫీజు ఓసీ, బీసీలకు రూ.6300, ఎస్సీ, ఎస్టీలకు రూ.5700గా నిర్ణయించినట్లు చెప్పారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలని చెప్పారు. మొత్తం 24 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అందులో నాలుగు ఎకనామికల్లీ వీకర్ సెక్షన్(ఈడబ్ల్యూఎస్) కోటాగా పేర్కొన్నారు.

పౌర హక్కుల నేత అనుమానాస్పద మృతి

- పంట పొలంలో విద్యుత్ షాక్‌తో మృత్యువాత
- పక్కా పథకం ప్రకారమే హత్య చేశారంటూ ప్రజాసంఘాల నాయకుల ఆందోళన


ఘటనా స్థలం వద్ద మృతదేహం


ఢిల్లీరావు (ఫైల్)

కాశీబుగ్గ: పలాస మండలం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో చిన్ననీలావతి గ్రామానికి చెందిన పౌరహక్కుల నేత, కౌలు రైతు తెప్పల ఢిల్లీరావు (57) అనుమానాస్పదంగా మృతిచెందారు. విద్యుత్ షాక్‌కు గురై పొలంలోనే మృత్యువాతపడ్డారు. అయితే ఇది ప్రమాదవశాత్తు జరిగినది కాదని, ఈ మృతిపై అనుమానాలున్నాయని అతని భార్య తెప్పల కమల కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు, ఢిల్లీరావును పక్కా పథకం ప్రకారమే హత్య చేశారని ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస మండలం చిన్ననీలావతి గ్రామానికి చెందిన తెప్పల ఢిల్లీరావు ప్రజల సమస్యలపై పోరాడుతుండేవారు. జేసీబీ, ట్రాక్టర్ అద్దెకు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రామకృష్ణాపురంలో రెండు ఎకరాల స్థలాన్ని కౌలుకు తీసుకుని పంటలు కూడా సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన పంట పొలాన్ని చూసి వస్తానని వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య కమల స్థానిక బంధువైన సొర్ర ప్రకాష్‌కు ఫోన్ చేసి వెతకమని చెప్పింది. రాత్రి 11 గంటల సమయంలో పంట పొలం వద్ద విద్యుత్ వైర్లు తగిలి మరణించినట్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం కాశీబుగ్గ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతిపై అనుమానాలు ఉన్నాయని ఢిల్లీరావు భార్య కమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ ఏఎస్ఐ జి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్, క్రైం బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించాయి. ఢిల్లీరావుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వంశీ సీమాన్‌గా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు సమీర్ పదో తరగతి చదువుతున్నాడు.


పలాస సీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్దాన ప్రజాసంఘాల నేతలు

మృతదేహంతో ఆందోళన

ఢిల్లీరావును చంపాలనే ఉద్దేశంతోనే చిన్న పాటి, సరిగ్గా కనిపించని కర్రలు పాతి దానికి విద్యుత్ తీగలు అమర్చారని భార్య కమల ఆవేదన వ్యక్తం చేసింది. ఢిల్లీరావు పేదల తరపున పోరాటాలు సాగిస్తుంటాడని, ఓ పేద రైతు పట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులు మోసం చేయాలని చూస్తే కాపాడారని ఉద్దాన ప్రాంతానికి చెందిన ప్రజాసంఘ నాయకులు వంకల మాధవరావు, పత్తిరి దానేషు గుర్తు చేశారు. ఏడాది క్రితమే ఢిల్లీరావుపై దాడి చేశారని, ఇప్పుడు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అడ్డుగా ఉన్నాడనే చంపేశారని ఆరోపించారు. ముందు హత్య చేసి అనంతరం పందులు పట్టడానికి పెట్టిన విద్యుత్ వైర్‌కు అంటించారని, పోలీసులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉద్దాన ప్రాంతానికి చెందిన వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆవరణలో మృతదేహం ఉంచి నిరసన వ్యక్తం చేశారు. నినాదాలు చేస్తూ పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల మీదుగా స్వగ్రామానికి తరలించారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

నరసన్నపేట: జేఈఈ మెయిన్స్ పరీక్షల నిర్వహణకు నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ సిద్ధమైంది. బుధవారం నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఒక సెంటర్‌ను కేటాయించగా అది నరసన్నపేట కోర్ టెక్నాలజీకి మంజూరు చేశారు. 3300 మంది పరీక్షలు రాయనున్నారు. 40 సీసీ కెమెరాలతో పరీక్ష సమయం అంతా ప్రతి నిమిషాన్ని రికార్డింగ్ చేయనున్నారు. నరసన్నపేట లో జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రం మంజూరు చేయడంపై జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రానికి ఇలా చేరుకోవచ్చు..
జాతీయ రహదారి-16కు ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డులో పరీక్ష కేంద్రం ఉంది. శ్రీకాకుళం వైపు నుంచి వచ్చే వారు నరసన్నపేట టౌన్‌లోనికి వెళ్లకుండానే పరీక్ష కేంద్రానికి చేరుకోవచ్చు. బైపాస్ రోడ్డులోని సర్వీసు రోడ్డు నుంచి గొట్టిపల్లి ఫ్లై ఓవరు వంతెన కింద నుంచి టెక్కలి వైపు నుంచి వచ్చే రోడ్డులోనికి వెళ్లగానే కోర్ టెక్నాలజీ సెంటర్ కనిపిస్తుంది. టెక్కలి వైపు నుంచి వచ్చే వాళ్లు అయితే సర్వీసు రోడ్డులో వస్తే మారుతీ నగర్ కూడలి వద్దకు వస్తే పరీక్ష కేంద్రం కనిపిస్తుంది. టౌన్‌లో నుంచి వస్తే సీఎంఆర్ పక్కన ఉన్న రోడ్డులో నుంచి చివరికి వస్తే కోర్ టెక్నాలజీ కనినిస్తుంది.

వ్యభిచార గృహంపై దాడి

శ్రీకాకుళం రూరల్: నగరంలోని ఆదిత్యానగర్ కాలనీలో మంగళవారం రాత్రి వ్యభిచార గృహంపై శ్రీకాకుళం రూరల్ పోలీసులు దాడులు చేశారు. పక్కా సమాచారం మేరకు సీఐ పైడపునాయుడు , రూరల్ ఎస్ఐ రాము ఆధ్వర్యంలో పోలీసులు ఓ ఇంట్లో తనిఖీలు చేయగా ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.9300 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో నేర నియంత్రణకు ప్రతి పోలీసు అధికారి అంకిత భావంతో విధులు నిర్వర్తించి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై చర్చించి సూచనలు చేశారు. నేరస్తులను పట్టుకోవడం, కేసుల ఛేదింపు, దర్యాప్తులు, ప్రాపర్టీ స్వాధీనంలో ప్రతిభ కనబరిచిన సీఐలు పైడపునాయుడు, ప్రసాదరావు, సత్యనారాయణలతో పాటు పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

కూర్మనాథుని హుండీల ఆదాయం రూ.18,49,523

గార: ఆదికూర్మ క్షేత్రం శ్రీకూర్మనాథాలయ హుండీల ఆదాయం రూ.18,49,523 వచ్చిందని పర్యవేక్షణాధికారి, జిల్లా ఎండోమెంట్ కార్యాలయం సీనియర్ సహాయకులు బీఎస్ రవికుమార్ తెలిపారు. మంగళవారం కూర్మనాథాలయంతో పాటు పాతాళ సిద్ధేశ్వర స్వామి ఆలయ హుండీలను బేడా మంటపంలో తెరిచి లెక్కించారు. నాలుగు నెలలకొకసారి లెక్కించాల్సి ఉన్నా రెవెన్యూ సదస్సులు కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. కార్యక్రమంలో ఈఓ జి.గురునాథరావు,ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, అర్చక బృందం సేవకులుగా ఇచ్ఛాపురానికి చెందిన సాయి స్వేచ్ఛావతి బృంద సభ్యులు పాల్గొన్నారు.


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సేవకులు

రైతుల అనుమతి లేకుండా.. కార్గో ఎయిర్‌పోర్టుపై ముందుకెళ్లం

వజ్రపుకొత్తూరు: స్థానిక రైతుల అభిప్రాయం, అనుమతి లేకుండా కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఒక్క అడుగూ ముందుకు వెళ్లబోమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. వజ్రపుకొత్తూరు మండల పరిషత్ బడ్జెట్, సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సవరణ బడ్జెట్ ఆదాయం రూ.12,47,12000 కాగా వ్యయం రూ.11,87,00,000. మిగులు రూ.60,1200గా చూపించారు. 2025-26 అంచనా బడ్జెట్ రూ.13,71, 83, 200గా ప్రవేశ పెట్టగా వ్యయం రూ.12,56,63,200 కాగా, మిగులు రూ.1,15,20,000తో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివిధ శాఖలపై సమీక్ష జరుపుతుండగా మండల విప్ తిర్రి గుణ కార్గో ఎయిర్‌పోర్టు విషయమై మాట్లాడారు. రైతులకు సమాచారం లేకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇంతలో ఎమ్మెల్యే స్పందిస్తూ ఎయిర్‌పోర్టుతో ఉపాధి అవకాశాలు రావడం సహించలేకే ప్రతిపక్షం ఉద్యమాలు అంటూ యాగీ చేస్తోందని అనడంతో ప్రత్యేకాహ్వానిడుతుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతి విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం స్వాగతిస్తున్నామని, ఐతే రైతులకు పరిహారం విషయంలో అన్యాయం జరగకూడదని, భూముల సర్వే చేసే సమయంలో రైతులకు తెలియజేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తప్పుచేసి, రైతులపైన ప్రతిపక్షంపైనా నెడితే సహించేది లేదన్నారు. దీనిపై తహసీల్దార్ కలగజేసుకుని.. భూముల సర్వే కేవలం ఎయిర్‌పోర్టు ఫీజుబిలిటీ కోసమేనని, అందుకే స్కెచ్ ఇచ్చామని, ఇంకా ఫైనల్ కాలేదని చెప్పడంతో చర్చ ముగిసింది. ఇదిలా ఉండగా ప్రోటో కాల్ అధికార పార్టీ నేతలు, అధికారులు ఉల్లంఘిస్తున్నరని అందుకే తాము ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంతకాలు చేయలేదని ఉదయ్‌కుమార్, ఇతర సభ్యులు అనడంతో ఒక్క సభలో గందరగోళం నెలకొంది. ఎంపీపీతో సహా సభ్యులంతా పోడియం వద్దకు వచ్చి ఎమ్మెల్యేను నిలదీశారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.రమేష్‌నాయుడు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, వైస్ ఎంపీపీలు వంక రాజు, తమ్మినేని శ్రావణి, ఎఫ్‌డీఓ ధర్మరాజు పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లపై దుష్ప్రచారం తగదు


మాట్లాడుతున్న సూర్యనారాయణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రేషన్ సరుకులు సరఫరా చేసే ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్లపై తప్పుడు ప్రచారాలు తగదని ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఎన్జీవో హోం కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఓ డీలర్ మృతికి ఎండీయూ ఆపరేటర్ల వేధింపులే కారణమని చెప్పడం దారుణమన్నారు. నెల్లూరు జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు సుదర్శనరావు ఇటువంటి దుష్ప్రచారాలకు పాల్పడటం సమంజసం కాదనారు. ఆపరేటర్లతో మీకు ఇబ్బందులు ఉన్నట్లయితే జిల్లా ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అంతేగాని ఎండీయూ వ్యవస్థను తప్పుపడుతూ దుష్ప్రచారాలకు పాల్పడితే ప్రచారాలు చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ఒకవేళ వాస్తవంగా ఇబ్బందులు ఉంటే ఎండీయూ యూనియన్ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సమావేశంలో ఎండీయూ ఆపరేటర్లు అప్పారావు, శివప్రసాద్, శ్రీను, కిషోర్, మాధవ్, బాలకృష్ణ, కిరణ్, వరుణ్, జగన్, రాజా, సంతోష్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తేజేశ్వరరావు


మాట్లాడుతున్న సిరిపురం తేజేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సిరిపురం తేజేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావుతో పాటు మరికొందరు అధ్యక్ష పదవికి నామినేషన్లు వేసినప్పటికీ కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో పార్టీ అధిష్టానం తేజేశ్వరరావు పేరును మంగళవారం ఖరారు చేసింది. జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో బీజేపీ నేత, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, సుహాసిని ఆనంద్, బీజేపీ రాష్ట్ర నేతలు పైడివేణుగోపాలం, పూడి తిరుపతిరావు, శవ్వాన ఉమామహేశ్వరి, సంపతిరావు నాగేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, పార్టీ పరిశీలకుల సమక్షంలో నూతన అధ్యక్షుడిగా తేజేశ్వరరావు పేరును ప్రకటించారు. ఈయన స్వగ్రామం పాతపట్నం నియోజకవర్గం సరాళి. గుజరాత్ రాష్ట్రంలో కొంతకాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి రాజకీయాల్లోకి వచ్చారు.

బాబూ.. మెగా డీఎస్సీ ఏమైంది..?


మాట్లాడుతున్న పరుచూరి రాజేంద్రబాబు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిరుద్యోగ భృతి ఇవ్వక పోవడం దారుణమని, హామీలు అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, మెగా డీఎస్సీ ఏమైపోయిందని అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 23వ జిల్లా మహాసభ శ్రీకాకుళం నగరంలో క్రాంతి భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ ప్రారంభ సూచికంగా ఏఐవైఎఫ్ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. సభలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్‌లు మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సమయంలో చంద్రబాబు, నారా లోకేస్ నిరుద్యోగులకు బోలెడు హామీలు ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 15,500 మంది గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం షాపులలో వివిధ స్థాయిల్లో పనిచేశారని, నేడు కూటమి వారందరినీ రోడ్డున పడేసిందన్నారు. 2.60లక్షల మంది వలంటీర్లకు ఉగాదికి తీపి కబురు అని చెప్పి మోసగించారన్నారు. నిరుద్యోగుల తరుపున ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరు వాసుదేవరావు, కొన్న శ్రీనివాసరావు ఏఐవైఎఫ్ నాయకులు సంతోష్, రాము, శ్యామ్, కర్ణ వీరుడు, వెంకటరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

23న స్మార్ట్‌హౌసింగ్ లాటరీ


మాట్లాడుతున్న చైర్మన్, వైస్ చైర్మన్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో పలాసలోని ఎన్టీఆర్ స్మార్ట్ హౌసింగ్‌లో ఈ నెల 23న లాటరీ విధానం ద్వారా ప్లాట్‌లు కేటాయించనున్నామని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, వైస్ చైర్మన్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. శ్రీకాకుళంలోని సుడా కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ ఎంఐజీ (మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్) కోసం బొడ్డపాడులో 152 ఎకరాల్లో లేఔట్ వేశామని, ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ప్లాట్లు బుక్ చేసుకున్న వారు మాత్రమే హాజరుకావాలని కోరారు. ఉదయం 10 గంటలకు ఫేజ్-1, బొడ్డపాడు లేఔట్ వద్దకు చేరుకోవాలన్నారు.

24న సుకన్య సమృద్ధి యోజన మేళా

శ్రీకాకుళం అర్బన్: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం తపాలా డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 24న సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లు తెరిచేందుకు మేళా నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ వందాన హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 ఏళ్లలోపు బాలికలకు ఖాతా తెరవవచ్చని, కాలపరిమితి 21 ఏళ్లు ఉంటుందని, బాలికకు 18 ఏళ్లు నిండాక ఉన్నత విద్య కోసం గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉన్న మొత్తంలో 50 శాతం వరకు విత్‌డ్రా చేసుకోవచ్చని వివరించారు. వివాహ నిమిత్తం నెల రోజులు ముందు గానీ, వివాహానంతరం మూడు నెలల లోపు గానీ పథకాన్ని ఉపసంహరించుకోవచ్చన్నారు. ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.250 మొదలుకుని గరిష్టంగా రూ.1.50లక్షల వరకు చెల్లించవచ్చని తెలిపారు. ఖాతాలో జమ చేసిన సొమ్ము మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుందని, అలాగే ఖాతాను ఏ తపాల కార్యాలయానికైనా ఎప్పుడైనా బదిలీ చేసుకునే సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు.


ఎమ్మెల్యే స్వగ్రామంలో బాలికపై లైంగిక దాడి

- నిందితుడికి పోలీస్‌స్టేషన్‌లో రాచమర్యాదలు!


ఎమ్మెల్యే ఈశ్వరరావుతో నిందితుడు ప్రసాద్(ఫైల్)

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు స్వగ్రామం బంటుపల్లిలో ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన నారు ప్రసాద్ అనే 23 ఏళ్ల యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి సోమవారం జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. బాధిత బాలిక బంటుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. చిన్నతనం, అమాయకత్వం వల్ల విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద దర్యాప్తు చేయగా.. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి యువకుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడు ప్రసాద్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా.. అక్కడ రాచమర్యాదలు జరిగినట్లు సమాచారం. కాగా, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు స్వగ్రామంలోనే ఇటువంటి దారుణం జరగడం సంచలనంగా మారింది. నిందితుడు ప్రసాద్ బంటుపల్లి పంచాయతీలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో తిరుమరెడ్డి సతీష్ అనే కాంట్రాక్టర్ వద్ద ఎస్.ఎం.ఆర్‌గా పనిచేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే వీరిద్దరూ యూబీ పరిశ్రమలో పాగా వేశారు. ఎమ్మెల్యేకు ప్రసాద్ వీరవిధేయుడుగా మెలగడంతోనే పరిశ్రమలో ఉద్యోగం వేయించారని గ్రామస్తులు గుసగుసలాడుకుంటున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య


మృతి చెందిన శాంతమ్మ

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామానికి చెందిన తామాడ శాంతమ్మ(55) మంగళవారం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శాంతమ్మ కొంతకాలంగా మానసిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. భర్త తులసీదాసు చాలా ఏళ్ల క్రితమే మృతి చెందాడు. కుమారుడు హరికృష్ణ సీమేన్‌గా పనిచేస్తున్నాడు. కోడలు ఇతర రాష్ట్రంలో ఉండటంతో శాంతమ్మ ఒంటరిగానే ఇంట్లో ఉంటూ అప్పుడప్పుడూ జీడి తోటకు వెళ్తుంటుంది. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం తోటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు వెళ్లి చూడగా శాంతమ్మ చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శాంతమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు పరిగణించారు. అయితే మృతురాలి మెడకు వేలాడుతున్న నైలాన్ తాడు తెగి కింద పడినట్లు కనిపించడంతో అనుమానాలు రేకెత్తిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా పోలీసులు శవ పంచనామ చేసి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నిహర్ తెలిపారు.